క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు



ఎమ్మెల్యేతో సుల్తానాబాద్ న్యాయవాదులు

ఎలిగేడు: సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నికైంది. మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, న్యాయవాదులు శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావును ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోర్టు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీరాములు తెలిపారు. న్యాయవాదులు వొడ్నాల రవీందర్, ఆకారపు సరోత్తం రెడ్డి, దూడం ఆంజనేయులు, సామల రాజేంద్రప్రసాద్, ఆవుల శివకృష్ణ, వడ్లకొండ రవికిరణ్, మల్యాల కరుణాకర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన యువ న్యాయవాది ఆవుల శివకృష్ణ మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శివకృష్ణకు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, ధన్నాయక్ దామోదర్‌రావు, న్యాయవాదులు వొడ్నాల రవీందర్, ఆకారపు సరోత్తం రెడ్డి, దూడం ఆంజనేయులు, సామల రాజేంద్రప్రసాద్, వడ్లకొండ రవి కిరణ్, మల్యాల కరుణాకర్ పాల్గొన్నారు.

కాలనీలు పరిశుభ్రంగా ఉండాలి



సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్: కాలనీలు పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ కార్మికులకు చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి సూచించారు. మంగళవారం మున్సిపల్ ఆవరణలో కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకోవాలని కార్మికులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు గాజుల రాయమల్లు ఉన్నారు.

వేసవిలో సాగు విధానంపై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏవో ఆదిరెడ్డి, రైతులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వేసవికాలంలో సాగు చేసే పంటలపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌తో అవగాహన కల్పించారు. వేసవి కాలంలో దోసకాయల సాగు, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి హాజరై రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ వీక్షించారు. డీఏవో మాట్లాడుతూ ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌కు రైతులు హాజరై శాస్త్రవేత్తలు సూచిస్తున్న మెలకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని రైతులకు సూచించారు. ఏవోలు బండి ప్రమోద్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతు

ముత్తారం: మండల కేంద్రమైన ముత్తారం నుంచి పారుపల్లి మీదుగా పోతారం వెళ్లే రింగు రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టుపై మొరం పోసి చదును చేసిన గుజ్జుల శ్రీధర్‌ను మంగళవారం స్థానికులు అభినందించారు. పోతారానికి చెందిన శ్రీధర్ తమ గ్రామం నుంచి పారుపల్లి, ముత్తారంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రి, బ్యాంకులకు వెళ్లాలంటే ఈ కల్వర్టుకు మరమ్మతు చేస్తే దగ్గరవుతుందనని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మర్మమ్మతు చేశారు.

ఓదెలలో రేషన్ షాపు సీజ్

ఓదెల: ఓదెల గ్రామంలో బుద్దే రామస్వామికి చెందిన రేషన్‌షాపు నంబర్ 20ని మంగళవారం సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ దుకాణానికి మొత్తం 86 క్వింటాళ్ల 34 కిలోల బియ్యం సరఫరా చేశారన్నారు. కానీ, తనిఖీ చేసిన సమయంలో నాలుగున్నర క్వింటాళ్ల తేడా రావడంతో అతనిపై కేసు నమోదు చేసి, దుకాణం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల మధ్య మురుగు.. జనాల బేజారు

- దుర్వాసన వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పూర్తిస్థాయి కాలువ నిర్మించకపోవడమే కారణం
- దోమలతో నరకయాతన



నిలిచిన మురుగునీరు

జ్యోతినగర్: జనాలు నివసించే ప్రదేశాల్లో నెలల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో ఆయా ప్రాంతాల వారు అనేక అవస్థలు పడుతున్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాల పల్లె శివారు మురుగుకూపంలా మారింది. నాలుగో డివిజన్ నుంచి వచ్చే వ్యర్థనీటితో పాటు ఐదో డివిజన్‌లో కొంతభాగం నిర్మించిన డ్రైనేజీ చివరి పాయింట్ వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడంతో ప్రజలకు సౌకర్యంగానే ఉన్నా చివరి వరకు పైపులైన్ వేయకపోవడంతో మురుగునీరు పోయే దారిలేదు. ఇళ్లలోని మురుగునీరు ఈ ఖాళీ స్థలంలో నెలల తరబడి ఉండడంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

మురుగునీటి నిల్వతో ఇబ్బందులు..

మురుగునీరు నిలిచి ఉండటంతో దోమల ఉధృతి పెరుగుతోంది. స్థానిక కార్పొరేషన్, శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యన మురుగునీరు రోజుల తరబడి ఉండడంతో మురుగు నీటి గుంతగా మారింది.

పూర్తి ప్రహరీ లేకపోవడమే కారణం..

ఎన్టీపీసీ సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో పూర్తిస్థాయి ప్రహరీ నిర్మించకపోవడంతో మురుగునీరు వెళ్లి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మురుగునీరు వెళ్లడానికి పూర్తిస్థాయి కాలువ నిర్మించకపోవడమే దుర్వాసన రావడానికి ముఖ్యకారణమన్నారు. ఖాళీ ప్రదేశాల నుంచి రాత్రి సమయంలో విషపురుగులు రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఈ మురుగునీటి నిల్వ నుంచి వెలువడుతున్న దుర్వాసనను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునేవారు లేరు



ఇంటి ముందు నిలబడాలంటే భయమేస్తోంది. ఇంటికి వచ్చిన చుట్టాలు కూడా దుర్వాసన రావడంతో ఎక్కువసేపు ఉండకుండా వెళ్లిపోతున్నారు. మమ్మల్ని పట్టించుకునే వారు లేరు. ఊరి మురుగునీరంతా మా ఇంటి ముందుకు వచ్చి చేరుతోంది. అయ్యా మాకు మురుగువాసన బాధ తప్పించండి.

– మల్లమ్మ, నర్రాశాలపల్లె

అంతర్గత రోడ్లు నిర్మించాలి



ఐదో డివిజన్ ఎన్టీపీసీ పునరావాస ప్రాంతానికి సీఎస్సార్ ద్వారా నిధులు విడుదల చేయాలి. ఎస్‌బీఐ బ్యాంకు నుంచి నర్రాశాలపల్లె వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. గ్రామంలో పార్కు ఏర్పాటు చేయాలి. అంతర్గత రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించాలి.

– గాండ్ల రామ స్వరూప, ఐదో డివిజన్

పంటలు ఎండిపోకుండా నీరందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్: ఎస్సారెస్పీ డి–86, డి–83 ద్వారా వేసిన పంటలు ఎండిపోకుండా కాలువ నీటిని అందించాలని ఎంపీపీ బాలాజీరావు అధికారులను కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంటపొలాలు ఎండిపోకుండా ఉండేందుకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కుంటలు, చెరువుల్లో ఉపాధిహామీ ద్వారా పనులను ఇరిగేషన్ శాఖ అధికారులు నిలిపివేస్తున్నారని, అలా చేయకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు ఉందని సూచించారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులకు ఉందన్నారు. గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ఎన్నికల అనంతరం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మన ఊరు మన బడి పథకంలో పనులు చేయగా కాంట్రాక్టర్లకు బిల్లులే రాక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బిల్లులు వచ్చేలా సంబంధిత ఇరిగేషన్‌శాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, జెడ్పీటీసీ మినుపాల స్వరూప, నాయబ్ తహసీల్దార్ మహేశ్ కుమార్, డాక్టర్ అనుదీప్, ఎంపీటీసీలు పకీర్ యాదవ్, రమేశ్‌శంకర్, లక్ష్మి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

జీడీకే–5 ఓసీపీ ఉద్యోగుల పనితీరు భేష్



విక్టరీ సింబల్ చూపుతున్న జీఎం, అధికారులు

గోదావరిఖని: సమష్టి కృషితో వార్షిక లక్ష్యాలు సాధించిన ఓసీపీ–1 ఉద్యోగుల పనితీరు భేష్ అని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అభినందించారు. మంగళవారం జీడీకే–5 ఓసీపీలో వార్షిక లక్ష్యాలు సాధించిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జీఎం మాట్లాడుతూ జీడీకే–5 ఓసీపీలో 2023–24లో నిర్దేశించిన 30లక్షల టన్నుల ఉత్పత్తికి లక్ష్యానికి గాను 35లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రికార్డు సృష్టించారన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, అధికారుల సంఘం నాయకులు పొనుగోటి శ్రీనివాస్, అధికారులు రామస్వామి, ఎన్ వీరావు, కాలరీ మేనేజర్ అనిల్‌గబాలే పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీ ప్రకటించాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

సుల్తానాబాద్: రాష్ట్రప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మంగళవారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, రాష్ట్రంలో పారిశ్రామిక కార్మిక పాలసీని ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలోని కార్మిక సంఘాల అందరితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ బహిరంగ లేఖ రాశారని తెలిపారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, నాయకులు మహంకాళి మల్లేశ్, ఆరేపల్లి సురేశ్, లక్ష్మి, లలిత, పద్మ, చిలుముల రామ్మూర్తి, పోచయ్య, మధు పాల్గొన్నారు.

ఓసీపీ–2 ఉద్యోగులకు అభినందన



అభినందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో 2023–24లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించినందుకు ఆర్జీ–3 అధికారులను జీఎం సుధాకర్‌రావు అభినందించారు. మంగళవారం ఓసీపీ–2 ఉపరితల గని ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జీఎం పాల్గొన్నారు. జీఎం మాట్లాడుతూ రానున్న కాలంలో కూడా ఇదే స్ఫూర్తితో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో, సమష్టి కృషితో సాధించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి రాజేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్ సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు నివాళి



నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

గోదావరిఖనిటౌన్: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా మంగళవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి నివాళి అర్పించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణరావుపల్లిలో గౌడ సంఘం నాయకులు సర్వాయి పాపన్న వర్ధంతి నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని బొంపల్లికి చెందిన దాడి శ్రీనివాస్(42) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. శ్రీనివాస్ సోమవారం రాత్రి ఆరుబయట మంచంపై నిద్రించాడు. కుటుంబసభ్యులు మంగళవారం వేకువజామున చూసేసరికి కిందపడి ఉండటంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని తలపై గాయం ఉండటంతో మృతిపై అనుమానాలున్నాయని భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: తనకు పెళ్లి కావడంలేదని మద్యానికి బానిసై వరికోట శ్రీనివాస్ (32) అనే కూలీ సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు. మృతుడి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

5న గాయత్రి కళాశాలలో జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీలో 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. విప్రో, ఐడీబీఐ బ్యాంకు, జేకే సాఫ్ట్ సొల్యూషన్స్, టీం లీజ్ డిజిటల్ యన్నిక్ టెక్ తదితర కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. వివరాలకు 83095 94634, 95331 66174 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇసుక డంప్‌లకు వేలం

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్‌లో ఇటీవల సీజ్ చేసిన ఇసుక డంపులకు 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అంతర్గాం తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు.

వైభవంగా బీరన్న నాగవెల్లి బోనాలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లిలో గొల్ల, కుమ్మ కులస్తుల ఆరాధ్యదైవమైన బీరన్న పట్నాలు, ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీరన్నదేవుడి నాగవెల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వామివారి నాగవెల్లి పట్నం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

గోదావరిఖనిటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్థానిక ఫొటోగ్రాఫర్ ఎండీ షర్ఫొద్దీన్‌కు రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం తరఫున రూ.10వేల చెక్కును మంగళవారం అందజేశారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పరిధిలోని సింగరేణి యాజమాన్యం కార్మికులకు అందిస్తున్న గోదావరి నది తాగునీటిలో బుధవారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మంగళవారం ఆర్జీ–2 పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి తెలిపారు. ఆర్జీ–2 ఏరియాలోని పోతనకాలనీ, కాలనీవాసులకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు గాను కాలనీలోని ఫిల్టర్ బెడ్‌ను శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ సూచించారు.

గోవుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

మంథని: గోవులను అక్రమంగా తరలించకుండా వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రపురి గౌతమేశ్వర గోశాల చైర్మన్ స్రవంతి విద్యాసాగర్ ఎస్సై వెంకటకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గోవుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేశ్ ఉన్నారు.

పెద్దాపూర్ జాతర వేలం పూర్తి

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే హక్కుకు దేవాదాయశాఖ అధికారులు నిర్వహించిన వేలం పూర్తయింది. గ్రామంలోని ఆలయ ఆవరణలో ఈవో సదయ్య సమక్షంలో వేలం నిర్వహించగా కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుకు రూ.64వేలు, లడ్డూ పులిహోర రూ.1.50లక్షలు, తైబజారు రూ.31వేలు, కూల్‌డ్రింక్స్ రూ.3వేలు మొత్తం రూ.2.48లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సదయ్య వెల్లడించారు. కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ సుజాత, గ్రామ ప్రముఖులు గొట్టెముక్కుల రవీందర్‌రెడ్డి, జ్యోతిబసు, కొమురయ్య, మద్దెల నరేశ్, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నూకాంబిక జాతర ఆహ్వానపత్రిక



ఆహ్వానపత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

రామగుండం: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌ను మంగళవారం నూకాంబిక పోచమ్మ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు కలిశారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమిటీ ముఖ్య సలహాదారులు రవీందర్‌కుమార్, ఉపాధ్యక్షులు పి.ఆనంద్, నరేశ్, గణపతి కలిసి 8న అంతర్గాం టీటీఎస్‌లో జరగనున్న నూకాంబిక(పోచమ్మ) అమ్మవారి అమావాస్య పండుగ జాతరకు హాజరు కావాలని కోరారు. సంబంధిత ఆహ్వానపత్రికను అందజేశారు.

తలపై బోనం.. కదిలిన జనం



కాల్వశ్రీరాంపూర్: బోనాలతో మహిళలు



కల్వచర్లలో బోనాలతో వెళ్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లిలో మంగళవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

కల్వచర్లలో రేణుక ఎల్లమ్మ బోనాలు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గౌడ కులస్తుల ఇళ్ల నుంచి మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న నర్సింహారావు

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అహర్నిశలు శ్రమించిన సింగరేణి కార్మికులకు బహుమతిగా సొంతింటి పథకం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు కోరారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా బొగ్గు ఉత్పత్తిలో ముందుకు పోతున్న సింగరేణి యాజమాన్యం ఈ ఏడాది 70.02 మిలియన్ టన్నులు సాధించిందన్నారు. దీనికి కృషి చేసిన కార్మికులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. కార్మికులందరికీ సొంత ఇళ్ల పథకం అమలు చేసి 250 గజాల స్థలం కేటాయించి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.30లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. సింగరేణి రిక్రూట్‌మెంట్ ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పోస్టుల పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ఉండాలన్నారు. పరీక్ష పేపర్లు తెలుగు, ఇంగ్లీషులో ఇవ్వాలని, ప్రశ్నాపత్రం ఏ సబ్జెక్ట్ ప్రిపరేషన్ కావాలో కార్మికులందరికీ ముందుగానే తెలియజేయాలన్నారు. నాయకులు మండె శ్రీనివాస్, ఆరెపల్లి చంద్రమౌళి, ఆసరి మహేశ్, తోట నర్సింహారావు, మామిడాల శ్రీహరి, రవి పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతి ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: వార్షిక లక్ష్యాల సాధనలో అహర్నిశలు శ్రమించిన సింగరేణి కార్మికులకు ప్రోత్సాహక బహుమతి, స్వీట్ బాక్స్‌లు అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో 2012 వరకు కార్మికులకు ప్రోత్సాహక బహుమతి, స్వీట్ బాక్స్‌లు ఇప్పించామన్నారు. నాయకులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, బోయిన స్వామి, తాని రాజబాబు, ఉప్పులేటి తిరుపతి, దాసరి అనిల్, జె.దేవయ్య, సదా మల్లేశ్, బండారి శ్రీనివాస్, టి.మల్లయ్య, దాసరి రామస్వామి, సూర్య, మైసయ్య, మేకల గట్టయ్య, నస్పూరి గట్టయ్య, సంగి సమ్మయ్య, పడాల ఉదయ్, రవి, దేవేందర్‌రెడ్డి, వేముల అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు



పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ శ్రీకాంత్

జ్యోతినగర్: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ గ్రీన్‌బెల్ట్ ఏరియాలో చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతలు మంగళవారం కూడా కొనసాగాయి. రాజీవ్ రహదారి – సర్వీసు రోడ్డు మధ్యలోని చిరువ్యాపారులకు తొలుత నోటీసులు అందించి కూల్చివేతలు చేపట్టారు. 15 రోజుల క్రితం కొందరు చిరువ్యాపారులు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. రెండోదశలో మరికొందరు చిరువ్యాపారులకు నోటీసులు అందించడంతోపాటు ప్రత్యామ్నాయంగా సండే మార్కెట్ సమీపంలో స్థలాలు కేటాయించారు. ఈక్రమంలోనే అక్రమ కట్టడాలు పూర్తిస్థాయిలో కూల్చివేశారు. రామగుండం బల్దియా కమిషనర్ శ్రీకాంత్, సిటీ అసిస్టెంట్ ప్లానర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. మేయర్ అనిల్‌కుమార్ పనులు పరిశీలించారు. కాగా ఎస్సై ఉదయ్‌కిరణ్ బందోబస్తు చేపట్టారు.

చేపలు పట్టేందుకు అనుమతివ్వాలి



వినతిపత్రం అందిస్తున్న రాజేందర్

మంథని: మండలంలోని గుంజపడుగు సమీపంలో సరస్వతి పంపుహౌస్ గ్రావిటీ కెనాల్‌లో చేపలు పట్టేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్‌కు, మత్స్య సహకార సంఘం జిల్లా శాఖకు మంగళవారం వినతిపత్రం అందించినట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు వీరబోయిన రాజేందర్ తెలిపారు. పంపుహౌస్‌లో చేపలు పట్టిన కంపెనీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకారులు సాదుల సదానందం, మల్లేశ్, కృష్ణ, ఊదరి శివ ఉన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఓదెల: మండలంలోని ఓదెల, పొత్కపల్లి, కొలనూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు బుధవారం ప్రారంభం అవుతాయని ఏపీఎం లతమంగేశ్వరీ తెలిపారు.

వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఉండొద్దు

పెద్దపల్లిరూరల్: ఎండాకాలంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా పెద్దపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీపీ బండారి స్రవంతి ఆదేశించారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు అరకొరగానే రావడంతో మొక్కుబడిగా ముగిసింది. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొందాలి

సుల్తానాబాద్: బాలికలు తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొంది ఉండాలని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే మాస్టర్ బుర్ర ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఎస్సై శ్రవణ్ కుమార్, కరాటే చీఫ్ ఎగ్జామినర్ వసంత్ కుమార్, ప్రిన్సిపాల్ తుమ్మ జోసెఫ్ అశోక్, కరాటే బ్లాక్ బెల్ట్స్ సందీప్, వైష్ణవి, శరణ్య పాల్గొన్నారు.